క్లుప్తంగా

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ఇంజేడులో శ్రీ లక్ష్మి వేంకటేశ్వరస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

ఉయ్యాలవాడ : మండలంలోని ఆర్.జంబుల దిన్నె, ఉయ్యాలవాడ, సుద్దమల్ల, ఇంజేడు గ్రామాల్లో శనివారం ఆలయాలకు భక్తులు ఉదయాన్నే చేరుకుని పూజలు చేశారు. ధనుర్మాసం సందర్భంగా అభయాంజనేయస్వామి, శ్రీ లక్ష్మీనరసింహ కంబగిరిస్వామి, శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామికి అభిషేకాలు, ఆకుపూజ, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అర్చకులు లక్ష్మణస్వామి, భాస్కర శర్మ, కమలేష్‌శర్మ, అనంతయ్య తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వేంకటేశ్వర స్వామికి విశేష పూజలు



సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

రుద్రవరం: మండలంలోని కొండమాయపల్లె పంచాయతీ మజరా వెలగలపల్లె పొలిమేరలో వెలసిన లక్ష్మీ గోదా సమేత వాసాపుర వెంకటేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు మధుసూదన రెడ్డి, రంగనాయకులు ఆధ్వర్యంలో అర్చకులు గోపీశర్మ, శివ ఉదయన్నే స్వామి అమ్మవార్లకు నిత్యపూజలు గావించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు విశేష పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. స్వామి అమ్మవార్లకు సామూహిక కుంకుమార్చన పూజలు చేశారు.

ఆడపిల్లలను ప్రోత్సహిద్దాం



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న పశు వైద్యాధికారి

రుద్రవరం: ఆడపిల్లలు చదువుకునేలా అందరూ ప్రోత్సహించాలని ఎర్రగుడిదిన్నె పశు వైద్యాధికారి మనోరంజన్ ప్రతాప్ అన్నారు. మండలంలోని తువ్వపల్లె తిప్ప మీద ఉన్న ఏపీ మోడల్ పాఠశాలలో శనివారం బేటి బచావో..బేటి పడావో కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన బాల బాలికల నుద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆడపిల్లల సంరక్షణకు పాటు పడాలన్నారు. ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లలితా దేవి సహస్ర నామ పారాయణం



సామూహిక పారాయణంలో పాల్గొన్న మహిళలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని మెయిన్ బజార్‌లో వెలసిన అమ్మవారిశాలలో సకల జనుల ప్రయోజనార్థం శ్రీ వాసవీ ఆర్యవైశ్య సంఘం, శ్రీవాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో 24 గంటల పాటు శ్రీలలితాదేవి సహస్ర నామ పారాయణం శనివారం ఉదయం వైభవంగా ప్రారంభమైంది. అధ్యక్షురాలు తాడువాయి ఇందుమతి, కూరాకు శోభారాణి మాట్లాడుతూ లోక కల్యాణం కోసం అమ్మవారిని ప్రసన్నం చేసుకోవడానికి 183 శ్లోకాల్లో అమ్మవారి వెయ్యినామాల గొప్పతనం గురించి ఈ పారాయణం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆదివారం ఉదయం 6గంటలకు పారాయణం మహా మంగళహారతులతో ముగిస్తామన్నారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భవనాశి వాసు, రామశేషు పాల్గొన్నారు.

పారిశ్రామిక రంగంపై అవగాహన



సచివాలయ సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

దొర్నిపాడు: విద్యార్థి దశలోనే పారిశ్రామిక, సాంకేతిక రంగంపై అవగాహ కలిగి ఉండాలని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు సూచించారు. ఇండస్ట్రియల్ విజిట్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని బుర్రారెడ్డిపల్లెలో మగ్గం వర్క్స్, సచివాలయల్లో ప్రభుత్వ రంగ సేవలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగ పడతాయన్నారు. కార్యక్రమంలో ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్ కంబగిరి రాముడు, ఉపాధ్యాయులు గడ్డం చెన్నయ్య, సరస్వతి, సునంద పాల్గొన్నారు.

రోడ్డు వెడల్పుకు కౌన్సిల్ ఆమోదం

- బీసీ కాలనీ, దేవనగర్, నూనెపల్లె రోడ్డు 50 అడుగుల మేర వెడల్పు
- ప్రజా ప్రతినిధులను అవమానిస్తే ప్రభుత్వానికి సరెండర్ చేస్తా – చైర్‌పర్సన్ మాబున్నిసా
- ప్రజా ప్రతినిధులను క్షమాపణ కోరిన ఎంఈ గుర్రప్ప



మాజీ ప్రధాని మన్మోహన్ మృతికి సంతాపం తెలుపుతున్న దృశ్యం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మాబున్నిసా

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని సాయిబాబానగర్ మీదుగా నౌమాన్ నగర్ నుంచి ఎల్ఐసీ ఆఫీసు వరకు బీసీ కాలనీ, దేవనగర్, శ్యాంనగర్ రోడ్డును 50 అడుగుల వెడల్పునకు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం తెలిపిందని చైర్‌పర్సన్ మాబున్నిసా తెలిపారు. శనివారం నంద్యాల మున్సిపల్ సాధారణ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ మాబున్నిసా అధ్యక్షతన జరిగింది. మొదట మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి పట్ల కౌన్సిల్ సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. అనంతరం అజెండాను ప్రవేశపెట్టగా కౌన్సిల్ సభ్యులు మాట్లాడారు. ప్రజాప్రతినిధులకు ప్రొటోకాల్ వర్తింపుపై తీవ్ర వాగ్వాదం జరిగింది. కౌన్సిల్ సభ్యులందరూ మున్సిపల్ కమిషనర్‌పై విరుచుకుపడ్డారు. ప్రొటోకాల్ ఉల్లంఘనకు కారణమైన మున్సిపల్ ఇంజినీర్ గుర్రప్ప క్షమాపణ చెప్పాలని, లేని పక్షంలో ప్రభుత్వానికి సరెండర్ చేయాలని పట్టుబట్టారు. దీంతో మున్సిపల్ ఇంజనీర్ భవిష్యత్‌లో ఇలాంటి తప్పు జరగకుండా చూస్తానని సభకు క్షమాపణ చెప్పారు. అనంతరం 28వ తేదీన మున్సిపల్ సమావేశంలో వాయిదా వేసిన అంశాన్ని కౌన్సిల్ రద్దు చేయడంతో మంజూరు కాబడిన టెండర్లు దాఖలు కాని 249 పనులను ఏప్రిల్ నెల లోపు మొదలు పెట్టని 25శాతం కంటే తక్కువ చేసిన పనులను రద్దు చేశారు. మాస్టర్ ప్లాన్‌లో శ్యాంనగర్, బీసీ కాలనీ, దేవనగర్ ప్రాంతాల్లో పేద ప్రజలు నివసిస్తున్నారని, 50 అడుగులు రోడ్డు వేస్తే వందల సంఖ్యలో పేద ప్రజలు నష్టపోతారని, రద్దు చేయాలని కౌన్సిలర్ చంద్రశేఖర్, మాబువలి, మున్సిపల్ వైస్ చైర్మన్ పాంషావలి కోరారు. అయితే కౌన్సిల్ మెజార్టీ సభ్యులు ఆమోదం తెలపడంతో మాస్టర్ ప్లాన్‌ను అమలు చేయాలని నిర్ణయించారు. మున్సిపల్ కార్మికులకు అందించే కొబ్బరినూనె, సబ్బులు, చెప్పులు నాణ్యతతో అందించాలని చైర్‌పర్సన్ మాబున్నిసా కమిషనర్‌ను ఆదేశించారు. మున్సిపల్ కార్మికుల వద్ద నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్న మున్సిపల్ అధికారిపై చర్యలు తీసుకోవాలని దేశం సులోచన డిమాండ్ చేశారు. ముల్లాన్‌పేటలో నాడు–నేడు పనుల కింద పాఠశాలను అందంగా తీర్చిదిద్దారని, వ్యక్తిగత మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను పరిష్కరించాలన్నారు. కమిషనర్ నిరంజన్‌రెడ్డి, వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, పాంషావలి, డీఈలు, ఏఈలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రోడ్డు వెడల్పు చేస్తామనడం నియంతృత్వమే

నంద్యాల(న్యూటౌన్): మాస్టర్ ప్లాన్ లేకుండా రోడ్డు వెడల్పు చేస్తామనడం నియంతృత్వమేనని, ఆ తీర్మాణాన్ని కౌన్సిల్ ఆమోదించడం సరైంది కాదని సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, పట్టణ కార్యవర్గ సభ్యులు మహమ్మద్ గౌస్, వెంకటలింగం అన్నారు. రోడ్డు వెడల్పుతో దేవనగర్, బీసీ కాలనీ, శ్యాంనగర్‌లలో నివసించే పేద ప్రజలు ఇబ్బందులు పడతారన్నారు. బంగారు అంగళ్ల వీధి వెడల్పు చేయాలని, తొలుత అక్కడ దృష్టి కేంద్రీకరించాలని కోరారు.

పెండింగ్ చలానాలు చెల్లించాలి

దొర్నిపాడు: వాహనాల తనిఖీల్లో సరైన ధ్రువపత్రాలు లేకపోవడంతో జరిమానా విధించామని వాటిని పెండింగ్ లేకుండా చెల్లించాలని ఎస్ఐ వెంకటేష్ సూచించారు. శనివారం మండల కేంద్రం శివారులో వాహనాల తనిఖీ చేపట్టారు. చలానా చెల్లించకపోతే వాహనం రిజిస్ట్రేషన్, లైసెన్స్ రద్దు చేస్తారని స్పష్టం చేశారు. ప్రతి వాహనదారుడు తగిన పత్రాలకు కలిగి ఉండాలన్నారు. అతివేగంతో వాహనాలు నడపరాదని, ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని చెప్పారు.

పిల్లలు బడుల్లోనే ఉండాలి



బాల కార్మికులతో మాట్లాడుతున్న అధికారులు

నంద్యాల(అర్బన్): పిల్లలను పనుల్లో పెట్టుకుంటే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, బడిఈడు పిల్లలు కచ్చితంగా బడుల్లోనే ఉండాలని జిల్లా బాలల సంరక్షణ అధికారిణి స్వప్న ప్రియదర్శిని అన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు హెర్ప్స్,స్టార్ సొసైటీ, జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఐసీడీఎస్ పీడీ లీలావతి, హెర్ప్స్ సంస్థ అధ్యక్షుడు కృష్ణయ్యయాదవ్, స్టార్ సొసైటీ అధ్యక్షుడు సుబ్బరాయుడు ఆధ్వర్యంలో వివిధ షాపులు, మెకానిక్ షెడ్లు, మార్కెట్ ప్రాంతాల్లో తనిఖీ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్, సంజీవనగర్, గాంధీచౌక్, కల్పనా సెంటర్, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో పర్యటించి బాల కార్మికులు, భిక్షాటన చేస్తున్న 15మంది పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులు, షాపు యజమానులను డబురాల మసీదు ప్రాంతంలో ఉన్న డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ కార్యాలయంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఎదుట హాజరు పరిచారు. సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ జుబేదా బేగం, సభ్యులు సంజీవరెడ్డి, మధుసుధాకర్ బడిలో చేరితే వచ్చే ప్రయోజనాలను వారికి వివరించారు.

చాగలమర్రి–చిన్నవంగలి రహదారికి ప్రతిపాదనలు



చిన్నవంగలి ఎస్సీ బాలుర హాస్టల్ మరుగుదొడ్లను పరిశీలిస్తున్న పీఆర్ ఎస్ఈ నాగరాజు

చాగలమర్రి: రూ.3 కోట్ల వ్యయంతో చాగలమర్రి – చిన్నవంగలి రహదారి నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు నంద్యాల జిల్లా పంచాయతీరాజ్ ఎస్ఈ నాగరాజు తెలిపారు. శనివారం మండలంలోని చిన్నవంగలి గ్రామంలోనున్న ఎస్సీ బాలుర సంక్షేమ వసతి గృహ భవనాన్ని, వసతులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ భవన మరమ్మతులపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పీఆర్ ఏఈ కొండారెడ్డిని ఆదేశించామన్నారు. అలాగే చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న చిన్నవంగలి నుంచి క్రిష్ణంపల్లె గ్రామానికి వెళ్లే రహదారి నిర్మాణానికి సుమారు రూ.15 లక్షలతో ప్రతిపాదనలు పంపుతామని చెప్పారు. అనంతరం చిన్నవంగలి, పెద్దవంగలి గ్రామాలలో నిర్మిస్తున్న, నిర్మాణాలు పూర్తయిన సీసీ రోడ్లను పరిశీలించారు. పీఆర్ డీఈ వెంకటరెడ్డి, ఏఈ కొండారెడ్డి, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు అనిల్ కుమార్, సందీప్ ఉన్నారు.

ఉర్దూ జూనియర్ కాలేజీ, కమ్యూనిటీ హాల్ నిర్మించాలి

నంద్యాల(న్యూటౌన్): నంద్యాలలో పీఎం జేవీకే పథకం కింద ఉర్దూ జూనియర్ కళాశాల, కమ్యూనిటీ హాల్ నిర్మాణ పూర్తి చేయాలని ఆల్ మేవా, ఆల్ మైనార్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ ఇమ్రాన్, ఎస్ఎం జేఏసీ కన్వీనర్ మౌలానా, అబ్దుల్లా రషాదీ, కన్వీనర్ మస్తాన్ ఓ ప్రకటనలో కోరారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం భాగస్వామ్యంతో పీఎం జేవీకే పథకం కింద జూనియర్ కాలేజీ, సంక్షేమ హాస్టల్, కమ్యూనిటీ హాళ్లు, ఇతర సదుపాయాల నిర్మాణాల కోసం 26.13 కోట్లు మంజూరు చేసిందన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌నగర్ సమీపంలోని పులిమద్ది రోడ్డులో 4.5 ఎకరాల్లో ఆరు భవనాలకు టెండరు ప్రక్రియ పూర్తయ్యిందని, అందులో నాలుగు హాస్టల్ భవనాల నిర్మాణం 70 శాతం పూర్తయి నిధుల కొరత వల్ల ఆగిపోయాయని వివరించారు. మంత్రి ఫరూక్ స్పందించి నిధులు మంజూరు చేసి వెంటనే పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.

5న హైందవ శంఖారావం



సమావేశంలో మాట్లాడుతున్న వీహెచ్‌పీ నాయకులు

నంద్యాల(వ్యవసాయం): హిందూ దేవాలయాల స్వయం ప్రతిపత్తి కోసమే జనవరి 5వ తేదీన విజయవాడలోని గన్నవరం సమీపంలో కేసరపల్లి గ్రామంలో హైందవ శంఖారావాన్ని నిర్వహిస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బుగ్గన చంద్రమౌళీశ్వరరెడ్డి, రాంప్రసాద్ పేర్కొన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సభకు హిందువులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నంద్యాల నుంచి హైందవ శంఖారావానికి బయల్దేరే వాహనదారులు తమ వద్ద పాసులను తీసుకొని వెళ్తే విజయవాడలో పార్కింగ్ అనుమతి ఉంటుందని, టోల్‌గేట్ వద్ద ఎటువంటి ఆటంకాలు ఉండవని చెప్పారు. ఆర్ఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి శ్రీనివాస్, కాల్వ శేషసాయి, జనపాల నాగరాజు పాల్గొన్నారు.

ఉద్యోగులను తొలగించొద్దు



ఏకగ్రీవ తీర్మాణ ప్రతం చైర్మన్‌కు అందజేస్తున్న కౌన్సిలర్లు

ఆళ్లగడ్డ: మున్సిపల్ పరిధిలో పనిచేసే ఉద్యోగులను ఎవరినీ తొలగించవద్దని ఏకగ్రీవంగా తీర్మాణం చేశామని చైర్మన్ రామలింగారెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ సమావేశ భవనంలో శనివారం చైర్మన్ డాక్టర్ రామలింగారెడ్డి అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల కొందరు కాంట్రాక్ట్ ఉద్యోగులను అధికార పార్టీ నేత చెప్పారని కమిషనర్ తొలగించిన విషయంపై సభ దృష్టికి వచ్చింది. దీంతో పనిచేస్తున్న ఏ ఒక్క ఉద్యోగిని కూడా తొలగించడానికి వీల్లేదని సమావేశానికి హాజరైన 15 మంది కౌన్సిలర్లు చైర్మన్‌తో కలిసి ఏకగ్రీవంగా తీర్మాణం చేసి వినతి పత్రం అందేజేశారు. తొలగించిన ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కమిషనర్‌కు సూచించారు.

పురాతన వాటర్ ట్యాంక్‌కు నూతన రూపు



శిరివెళ్ల: 45 ఏళ్ల కితం నిర్మించిన ప్రధాన వాటర్ ట్యాంక్‌కు నూతన కళ వచ్చింది. యర్రగుంట్ల మేజర్ గ్రామ పంచాయతీలో వాటర్ ట్యాంక్ 15 సంవత్సరాల నుంచి శిథిలమవడం ప్రారంభమైంది. ట్యాంక్ పిల్లర్లు శిథిలావస్థకు చేరుకొని ట్యాంక్ కూలిపోయే దశకు చేరుకుంది. పంచాయతీలో 14 వార్డులుండగా.. 7 వార్డుల ప్రజలకు ఈ ట్యాంకు నీరే ఆధారం. ట్యాంక్‌లో 1.50లక్షల లీటర్ల నీటిని నింపేవారు. పూర్తి స్థాయిలో నీటిని నింపితే ట్యాంక్ కూలిపోతుందని అధికారులు చెప్పారు. దీంతో పంచాయతీ సిబ్బంది 75 వేల లీటర్ల నీటిని మాత్రమే నింపేవారు. ఆ నీరు ప్రజలకు సరిపోయేది కాదు. దీంతో గ్రామ సర్పంచు అయ్యలూరి సుభహాన్ చొరవ తీసుకొని పంచాయతీ నిధులతో ట్యాంకుకు మరమ్మతులు చేయించారు. ట్యాంక్ పిల్లర్లుకు, లోపలి భాగం పూర్తిగా ఆధునీకరించారు. మొత్తానికి ట్యాంక్‌కు మళ్లీ కొత్తగా రూపుదిద్దారు. శనివారం సి బ్బంది ప్రయోత్మకంగా 1.50లక్షల నీటిని నింపారు. ఎలాంటి సమస్య తలెత్తలేదని సర్పంచు తెలిపారు.

యర్రగుంట్లలో పాత ట్యాంక్‌ను మరమ్మతులు చేసి నూతనంగా తీర్చిదిద్దిన దృశ్యం

జాతీయ స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే శిల్పారవి

నంద్యాల(న్యూటౌన్): ఈ నెల 7, 8, 9 తేదీల్లో హర్యానాలోని కంచుకుల తావు దేవిలాల్ ఇండోర్ స్టేడియంలో స్పైక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన పోటీల్లో నంద్యాల జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటినట్లు నంద్యాల జిల్లా స్పైక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సిహాన్ షేక్ నూర్‌బాషా, అధ్యక్షుడు సోమశేఖర్ తెలిపారు. వారు మాట్లాడుతూ ఒక బంగారు, మూడు వెండి, నాలుగు కాంస్య పతకాలు సాధించారని చెప్పారు. విజేతలను మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి శనివారం తన స్వగృహంలో అభినందించారు.

సచివాలయాల్లో ఎస్సీల జాబితా ప్రదర్శన

ఉయ్యాలవాడ : ఎస్సీ వర్గీకరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సచివాలయాల్లో ఎస్సీ కుల గణనపై సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. శనివారం స్థానిక గ్రామ సచివాలయంలో సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ మేరకు మండల పరిధిలోని 11 గ్రామ సచివాలయాల్లో ఎస్సీ కులగణన వివరాలను ప్రదర్శించామన్నారు. వీటిపై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 31వ తేదీలోగా తెలియజేయాలని సూచించారు. 2025 జనవరి 6న అభ్యంతరాలపై క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తామన్నారు. సమగ్ర వివరాల సేకరణ పూర్తి అనంతరం జనవరి 10న కులగణన తుది జాబితా వివరాలను సచివాలయాల్లో ప్రదర్శిస్తామని ఎంపీడీఓ వివరించారు.

విద్యుత్ పొదుపు.. భావి తరాలకు వెలుగు

ఉయ్యాలవాడ : విద్యుత్‌ను ఆదా చేస్తే భావి తరాలకు వెలుగునిచ్చిన వాళ్లమవుతామని మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. శనివారం శక్తి వారోత్సవాల్లో భాగంగా గ్రీన్ కాప్స్ విద్యార్థులతో కలిసి ర్యాలీ చేసి స్థానిక బస్టాండ్ ఆవరణలో మానవహారంగా ఏర్పడ్డారు. సోలార్ విద్యుత్ వాడకంతో కరెంట్ బిల్లులు తగ్గడంతో పాటు ఆదాయ వనరులు సమకూర్చుకోవచ్చన్నారు. ప్లాస్టిక్ వస్తువులను పూర్తిగా నివారించి కాటన్ వస్తువులను ఉపయోగించాలని సూచించారు. పరిసరాలను శుభ్రంగా వుంచుకోవాలని నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాడుతాం

నంద్యాల(న్యూటౌన్): విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాడుతామని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఆర్ నాయక్ పేర్కొన్నారు. శనివారం ఎస్ఎఫ్ఐ 55వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ జూనియర్ డిగ్రీ కళాశాల ఎదుట జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యారంగంలో ఎన్ఈపీ 2020 తీసుకొచ్చి విద్యను పూర్తిగా వ్యాపారం చేసిందన్నారు. బడుగు బలహీన వర్గాల విద్యార్థులు విద్యకు దూరంగా ఉన్నారన్నారు. కేంద్రీయ విద్యాలయంలో నో డెటెన్షన్ విధానం రద్దు చేయడం కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్య దళితులు, గిరిజనులు, వెనుకబడి తరగతులు, గ్రామీణ ప్రాంత పిల్లలపై ప్రభావం చూపుతుందన్నారు. నాయకులు సందీప్, హర్ష, ఉదయ్, పవన్, యోగేంద్ర, చరణ్, మురళీ, నబీ, కిశోర్, కార్తీక్ పాల్గొన్నారు.

నందీశ్వరస్వామికి పరోక్షసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలోని శ్రీస్వామి అమ్మవార్ల ఆలయ ప్రాంగణంలోని శనగన బసవన్నగా పేరుపొందిన నందీశ్వరుడికి శాస్త్రోక్తంగా అర్చకులు విశేష పూజలను నిర్వహించారు. శుద్ధ త్రయోదశి, బహుళ త్రయోదశి రోజులలో నందీశ్వరస్వామి పూజను భక్తులు పరోక్షంగా నిర్వహించుకునే అవకాశం దేవస్థానం కల్పించింది. శనివారం 34మంది భక్తులు పరోక్షసేవగా నందీశ్వర స్వామి విశేషపూజను జరిపించుకున్నారు. నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకాది అర్చనలను గావించారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మొక్కుబడిగా రెవెన్యూ సదస్సులు



మిట్నాల గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించిన దృశ్యం (ఫైల్)

నంద్యాల(అర్బన్): మండలంలోని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు మొక్కుబడిగా సాగుతున్నాయి. గ్రామ సభల్లో స్వీకరిస్తున్న దరఖాస్తులకు పరిష్కారం ప్రశ్నార్థకంగా మారింది. కొన్ని దరఖాస్తులను సభలోనే పరిష్కరించి అర్జీదారులకు ధ్రుపత్రాలు అందించాల్సి ఉన్నా ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టడం లేదని ప్రజలు వాపోతున్నారు. తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగే పని లేకుండా ఈ సదస్సుల ద్వారా తమ భూముల సమస్యలు, కష్టాలు తీరుతాయని రైతులు, ప్రజలు ఆశించారు. దీంతో సమస్యలపై దరఖాస్తులు అందజేశారు. అయితే ఆ సమస్యల పరిష్కారానికి అధికారులు పెద్దగా శ్రద్ధ చూపడం లేదని, దీంతో గ్రీవెన్స్ లాగే ఈ రెవెన్యూ సదస్సుల ద్వారా ప్రయోజనం ఉండదని ప్రజలు తెలుసుకోవడంతో సదస్సులు ప్రజలు, రైతులు లేక బోసిపోతున్నాయి. ఒక్కో గ్రామ సదస్సుల్లో మూడు నాలుగు దరఖాస్తులు మాత్రమే వస్తుండటమే ఇందుకు నిదర్శనం. మండల గ్రామాల్లో ఇప్పటి వరకు 14 గ్రామ సదస్సులు నిర్వహించగా 49 దరఖాస్తులు మాత్రమే వచ్చినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరిస్తాం

ఉయ్యాలవాడ : గ్రామ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరిస్తామని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. శనివారం మండలంలోని ఆర్.జంబులదిన్నె, వెంగంపల్లె గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో 519 మంది రైతులకు సంబంధించి 3,928 ఎకరాల విస్తీర్ణంలో భూముల రీసర్వే చేయవలసి ఉందన్నారు. గ్రామసభలో 25 మంది రైతులు హాజరై కొలతల్లో తేడాలు, పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరులో జాప్యం, తదితర అంశాలపై దరఖాస్తులు అందజేశారు. మండల సర్వేయర్ విజయలక్ష్మి, వీఆర్ఓ లక్ష్మిచెన్నప్ప పాల్గొన్నారు.

పట్టా భూమిని ఇనాం భూమిగా మార్చారు



మిట్నాల గ్రామంలోని సర్వే నంబరు 286లోని 94 సెంట్ల రిజిస్టర్ భూమిని రెవెన్యూ అధికారులు ఇనాం భూమిగా మార్చారు. బ్యాంకు రుణం కోసం వెళ్తే ఇనాం భూముల్లో ఉందంటూ లావాదేవీలు జరపడం కష్టమని చెప్పడంతో ఇటీవల గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో అధికారులకు ఇనాం భూమి విషయంపై దరఖాస్తు సమర్పించా. పక్కపక్క సర్వే నంబర్లలోని భూములు ఒకే వ్యక్తి సర్వే నంబరులోకి వెళ్లాయి. అందుకు సంబంధించిన సబ్ డివిజన్ పనుల్లో బిజీగా ఉన్నాం. పట్టా భూములు ఇనాం భూములుగా మారిన విషయాన్ని తర్వాత పరిశీలిస్తామని చెప్పారు. ఈ విషయాన్ని సంబంధిత వీఆర్‌ఓకు తెలిపితే మీ భూమి పోర్టల్‌లో తాను సంతకం చేస్తే బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోవచ్చని తెలపగా బ్యాంకుకు వెళితే నిరాశే ఎదురైంది. –గోపాల్‌రెడ్డి, రైతు, మిట్నాల

నాటుకోడికి పెరిగిన డిమాండ్

- గ్రామాల్లో తగ్గుతున్న నాటుకోళ్ల పెంపకం
- పెరుగుతున్న నాటుకోడి ధరలు



విక్రయానికి సిద్ధంగా ఉంచిన నాటుకోళ్లు

గోస్పాడు: గ్రామాల్లో ఒకప్పుడు ఎక్కడ చూసినా నాటుకోళ్లు కనిపించేవి. ఇంటికి చుట్టాలు ఎవరూ వచ్చినా నాటుకోడి తెగాల్సిందే. అయితే ప్రస్తుతం వాటి పెంపకంపై ప్రజలు ఆసక్తి చూపడం లేదు. దీంతో రోజురోజుకు నాటుకోళ్ల సంఖ్య తగ్గిపోతుంది. దీంతో నాటుకోడి మాంసంకు డిమాండ్ పెరిగి మటన్ ధరకు సమానంగా పలుకుతోంది. గతంలో చికెన్ కంటే నాటుకోడి కిలోకు రూ.50 మాత్రమే అధికంగా ఉండేది. ప్రస్తుతం పొట్టేళ్ల మాంసానికి సమానంగా పెరగడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు నాటు కోడి మాంసం కొనలేని పరిస్థితి. ప్రస్తుతం గ్రామాల్లో కోళ్ల పెంపకం తగ్గడంతో అందుబాటులోకి పౌల్ట్రీ చికెన్ రావడంతో గత్యంతరం లేక ప్రజలు వాటినే కొనుగోలు చేస్తున్నారు. కిలో చికెన్ ధర రూ.160 నుంచి రూ.200ల వరకు పలుకుతోంది. పండుగల సమయాల్లో వీటిధర రూ.250 నుంచి రూ.300 కు చేరుతోంది. పొట్టేలు మాంసం ధర కిలో రూ.700 నుంచి రూ.800 వరకు విక్రయిస్తున్నారు. నాటుకోళ్లు లేకపోవడంతో వాటిని పోలి ఉండే వాటిని కిలో రూ.650 నుంచి రూ.750 వరకు చెల్లించాల్సి వస్తోంది.

విద్యుత్ లేక.. వినియోగానికి నోచుకోక!



చిన్నవంగలిలో వినియోగానికి నోచుకోని ఆర్బీకే, ట్రాన్స్‌ఫార్మర్‌ను మరమ్మతుల కోసం తీసుకెళ్లిన దృశ్యం

చాగలమర్రి: మండలంలోని చిన్నవంగలి గ్రామంలో వైఎస్సార్‌సీపీ హయంలో నిర్మించి ప్రారంభించిన రైతు భరోసా కేంద్రం విద్యుత్ సదుపాయం లేక వినియోగానికి నోచుకోవడం లేదు. దీంతో లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన భవనం నిరుపయోగంగా మారింది. గ్రామ ఎస్సీ కాలనీలోని రైతు భరోసా కేంద్రం వద్ద 4 నెలల క్రితం కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్తది ఏర్పాటు చేయలేదు. నాలుగు నెలల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందని స్థానికులు విద్యుత్ శాఖ అధికారులకు సమాచారమివ్వగా అధికారులు స్పందించలేదు. ఎట్టకేలకు రెండు నెలల క్రితం ట్రాన్స్‌ఫార్మర్‌ను మరమ్మతులు పేరుతో తీసుకెళ్లారు. ఇప్పటి వరకు నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయలేదు. దీంతో విద్యుత్ సదుపాయం లేక రైతు భరోసా కేంద్రానికి తాళం వేశారు. దీంతో ఎరువుల బస్తాలను వ్యవసాయాధికారులు సచివాలయంలోనే నిల్వ చేస్తున్నారు.

9న మండల సర్వసభ్య సమావేశం

దొర్నిపాడు: జనవరి 9వ తేదీన మండల సర్వసభ్యసమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సావిత్రి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో రావాలని సూచించారు.